క్లుప్తంగా

ఆర్‌బీకేలకు చేరుకున్న ఎరువులు



కొప్పురవలస సచివాలయానికి చేరిన యూరియా

వంగర: మండలంలోని అన్ని గ్రామాల ఆర్బీకేలకు ఎరువులు చేరుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ఆరంభం కావడంతో అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపారు. దీంతో తలగాం, కొప్పురవలస సచివాలయాలకు యూరియా చేరింది. మిగిలిన సచివాలయాలకు కూడా అవసరమైన ఎరువులు త్వరలోనే చేరుతాయని వ్యవసాయాధికారులు తెలిపారు.

విత్తనాలకు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

వంగర: ఖరీఫ్ పంటల సాగుకు అవసరమైన విత్తనాలు కావాల్సిన రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ తట్టికోట కన్నబాబు తెలిపారు. మండల పరిధిలోని కొప్పుర, కొప్పరవలసలో విత్తన ఎంపిక, పచ్చిరొట్ట విత్తనాలు సాగు వంటి అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అవసరమైన విత్తనాలు ఆర్బీకేల్లో ఉన్నాయని, అగ్రికల్చర్ అసిస్టెంట్ల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కిమిడి సన్యాసినాయుడు, రైతులు పాల్గొన్నారు.

నమోదు చేసుకోవాలి

బాడంగి: ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలకు రైతులు సమీపంలోని ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె. శిరీష అన్నారు. బుధవారం స్థానిక ఏఓ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. 950 క్వింటాళ్ల ఎంటీయూ-1121 రకం, ఎంటీయూ-1063 రకం విత్తనాలు రాయితీపై అమ్మకానికి సిద్ధం చేశామన్నారు. వరినారు మడులను దున్ను చేసుకుని సిద్ధం చేసుకోవాలని సూచించారు.

పక్కాగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ



అంగన్వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ నూకాలమ్మ

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ బాగుండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నూకాలమ్మ అన్నారు అంబఖండిలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు అందిస్తున్న వైఎస్సార్ పోషణ, బాలామృతం వస్తు సామాగ్రిపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక



ఎం.హర్షవర్ధన్



ఎల్.లోకేశ్వరి

వంగర: మండల పరిధిలోని అరసాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.హర్షవర్ధన్, లచ్చుభుక్త లోకేశ్వరి ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు విద్యార్థులను హెచ్‌ఎం ఖండాపు జగదీశ్వరి, ఉపాధ్యాయులు బుధవారం ప్రత్యేకంగా పాఠశాల ఆవరణలో అభినందించారు.

ఆటలతో ఆనందం



చిన్నారులతో ఆటలు ఆడిస్తున్న లైబ్రేరియన్ ఉషారాణి

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా లైబ్రేరియన్ ఎం.ఉషారాణి విద్యార్థులకు క్యారంబోర్డు, లూడో, చెస్, తదితర గేమ్స్ ఆడించారు. విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం పొందటానికి చదువుతో పాటుగా క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. అనంతరం విద్యార్థులకు నీటి పద్యాలు, వాటి తాత్పర్యాన్ని వివరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



బొబ్బిలి: మొక్కలు నాటుతున్న న్యాయమూర్తి అరుణశ్రీ



బొబ్బిలి: నారసింహునిపేటలో మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం రామారావు, సిబ్బంది



బొబ్బిలి: బ్రహ్మకుమారీస్ బొబ్బిలి బ్రాంచ్‌లో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

బొబ్బిలి: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. అరుణశ్రీ, డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు సముదాయం, డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. అలాగే మండలంలోని నారసింహునిపేట జెడ్పీ హెచ్ స్కూల్‌లో హెచ్‌ఎం ఎస్. రామారావు మొక్కలు నాటారు. బ్రహ్మకుమారీస్ బొబ్బిలి బ్రాంచ్ ఇన్‌చార్జ్ టీకే రాజేశ్వరి ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం నిర్వహించారు.

కోర్టు ఆవరణలో..

రాజాం సిటీ: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వివేక్‌ఆనంద్ శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోర్టు ఆవరణ, ఓల్డేజ్ హోమ్ ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం కాలుష్య కారకాలతో పర్యావరణంలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రామినాయుడు, ప్రభుత్వ న్యాయవాది ఎస్.పోలారావు, తదితరులు పాల్గొన్నారు.



రాజాం సిటీ: పొనుగుటివలసలో మొక్కలు నాటుతున్న మహిళలు



రాజాం సిటీ: ఓల్డేజ్ హోమ్‌లో మొక్కలు నాటుతున్న సీనియర్ సివిల్ జడ్జి వివేకఆనంద్ శ్రీనివాస్ తదితరులు.

ఉద్యమంలా మొక్కలు నాటే కార్యక్రమం....

రాజాం మున్సిపాల్టీ పరిధిలోని అన్ని వార్డుల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఉద్యమంలా చేపట్టారు. కొండంపేట, గాయత్రికాలనీ, వస్త్రపురి కాలనీ, అమ్మవారి కాలనీ, వాసవీనగర్, సారథి, మెంటపేట, పొనుగుటివలస, ఆర్‌అండ్‌బీ బంగ్లా, అర్బన్ హెల్త్ సెంటర్, ఆదర్శనగర్ తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటారు.

ఎన్‌సీసీ విద్యార్థుల ప్రతిజ్ఞ....

స్థానిక జీఎంఆర్ ఐటీలో ఎన్‌సీసీ శిక్షణలో ఉన్న క్యాడెట్లు అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలను ప్రజలకు వివరిస్తూ ఈ నెల 8వ తేదీ వరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం చేపట్టమని వారంతా ప్రతిజ్ఞ చేశారు.

మొక్కలు నాటిన ఎంఈఓ



రామభద్రపురం: నాయుడువలస పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంఈఓ-1,2 తిరుమలప్రసాద్, పెంటయ్య

రామభద్రపురం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎంఈఓ-1 తిరుమలప్రసాద్ అన్నారు. నాయుడువలస ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎంఈఓ -2 పెంటయ్యతో కలిపి మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగభూషణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అందరి బాధ్యత..



సంతకవిటి: మొక్కలు నాటుతున్న ప్రధానోపాధ్యాయుడు రవిశంకర్

సంతకవిటి: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని మందరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉరిటి రవిశంకర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ గడే అప్పలనాయుడు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చదనాన్ని పెంచి ... పర్యావరణాన్ని కాపాడుదాం



రాజాం : మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం మాధురి, హేమలత, తదితరులు

రాజాం: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సారథి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.మాధురి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి. హేమలత, ఎస్.శశికళ, ఎం.సూర్యకాంతం, ఎం .లక్ష్మి, వై.సంధ్య, ఎం.సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో ప్రాణవాయువు..



బాడంగి: హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంఈఓ రాజేశ్వరి, హెచ్‌ఎం, తదితరులు

బాడంగి: మొక్కలతో ప్రజలకు అవసరమైన ప్రాణవాయువు లభిస్తుందని ఎంఈఓ -2 రాజేశ్వరి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం సత్యనారాయణతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పచ్చదనంతో పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో..



మొక్కలు నాటుతున్న కార్యకర్త శ్రీదేవి

తెర్లాం: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని తెర్లాం-5 అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రం వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో హెల్పర్ లక్ష్మి, ప్రీస్కూల్ పిల్లలు పాల్గొన్నారు.

ఊరటనిచ్చిన వర్షం



రామభద్రపురంలో కురుస్తున్న వర్షం



రాజాం : ప్రధాన రహదారి మీదుగా ప్రవహిస్తున్న వర్షపునీరు

రామభద్రపురం: మండల కేంద్రంలో బుధవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం మూడు గంటల వరకు భానుడి ప్రతాపంతో విలవిల్లాడిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షంతో సేదదీరారు. ఈ వర్షం కూరగాయలు, పత్తి పంటలకు మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బాడంగిలో తేలికపాటి వర్షం..

బాడంగి: మండలంలో తేలికపాటి వర్షం కురిసింది. వేసవి ఎండలు, ఉక్కబోతతో సతమతమవుతున్న తరుణంలో చల్లటి గాలులతో పాటు వర్షపు జల్లులు కురవడంతో ప్రజలు కాస్తంత ఉపశమనం పొందారు. పచ్చిరొట్ట ఎరువులు జల్లుకోవడానికి, నారు మడులు సిద్ధం చేసుకోవడానికి వర్షం ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు.

జోరువాన

రాజాం: పట్టణంలో జోరువాన కురిసింది. దీంతో ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. ప్రయాణికుల రాకపోకలకు కాసేపు అంతరాయం ఏర్పడింది. వర్షానికి వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందారు.

ప్రజలందరికీ ధన్యవాదాలు

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: సార్వత్రిక ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలిచిన ప్రజలందరికీ మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ధన్యవాదాలు తెలియజేశారు. పక్కి గ్రామంలో తనను కలవడానికి వచ్చిన ప్రజలతో బుధవారం సాయంత్రం వరకు మాట్లాడి, పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంతవరకు తనకు అండగా నిలిచిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. గెలిచిన అభ్యర్థులకు అభినందనలు తెలియజేశారు. శంబంగిని కలిసిన వారిలో తూముల భాస్కర రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణ, శంబంగి వేణుగోపాలనాయుడు, ఆరికతోటకు చెందిన పెంకి భీమయ్య, నాలుగు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన నాయకులు ఉన్నారు.



కింతలివాని పేట గ్రామస్తులతో మాజీ ఎమ్మెల్యే శంబంగి

యంత్ర వినియోగం లాభదాయకం



చిన్నకోడిశలో ఫెర్టికమ్ సీడ్ డ్రిల్ యంత్రం ద్వారా వరి ఎదలు వేస్తున్న సిబ్బంది

రేగిడి: సాగులో యంత్రాలను వినియోగించడం లాభదాయకమని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ బి.లక్ష్మీనరసింహమూర్తి అన్నారు. మండల పరిధిలోని చిన్నకోడిశ గ్రామంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లి నారాయణరావుకు చెందిన రైతు పొలంలో ఫెర్టికమ్ సీడ్ డ్రిల్ యంత్రం ద్వారా పొడి వరి ఎదసాగుపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక వ్యవసాయ పద్ధతులు ఉపయోగించి, యాంత్రాలతో సాగు చేపట్టడం వల్ల తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చని చెప్పారు. అవసరమైన రైతులు 99855 42147 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త శరత్‌బాబు, ఉమామహేశ్వర రావు, కొండవలస, ఉణుకూరు, ఒప్పంగి, తదితర గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

రేగిడి: మండలంలోని అంబఖండి అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు రేజేటి సత్తిబాబుశర్మ, వంశీకృష్ణ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

ఎండలో పనిచేయొద్దు

రేగిడి: ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయంలో ఉపాధి వేతనదారులు పనులు చేయరాదని ఏపీఓ ఎస్.హరనాథరావు సూచించారు. మండలంలోని తోకలవలస పంచాయతీ లచ్చనవలస గ్రామంలోని బుడితివాని చెరువులో చేపడుతున్న పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారుల మస్టర్లను తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణరావు, మేట్‌లు ఉన్నారు.

విత్తనాలకు పేర్ల నమోదు



తాటిపాడులో పేర్లు నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

రేగిడి: మండలంలోని కందిశ, తాటిపాడు, లక్ష్మణవలస, తదితర గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాల వద్ద బుధవారం విత్తన నమోదు కార్యక్రమం చేపట్టారు. ఆయా గ్రామాల్లోని సర్పంచ్‌ల సమక్షంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు విత్తనాలు కావాల్సిన రైతుల పేర్లు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఓ జి. మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పరిశుభ్రత

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో పెరిగిన పిచ్చిమొక్కలు, పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం శ్రమదానం చేసి వాటిని తొలగించారు. కళాశాలల వెనుక వైపు విశాలమైన స్థలం ఉందని, దాన్ని శుభ్రం చేసి వివిధ రకాల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.

మహారుద్రాభిషేకం



శివలింగాలకు రుద్రాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గేటు సమీపంలో ఉన్న ఓం సదనం ఆశ్రమంలో వైశాఖమాస మాసశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు అంపోలు ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో 108 శివలింగాలకు మహారుద్రాభిషేకం నిర్వహించారు. మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన, తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నిషేధిత పురుగు మందులు విక్రయిస్తే చర్యలు

- ఏఓ వెంకటయ్య



మాట్లాడుతున్న ఏఓ వెంకటయ్య

రామభద్రపురం: నిషేధిత పురుగు మందులు, విత్తనాలు విక్రయిస్తే దుకాణాల అనుమతులు రద్దు చేస్తామని ఏఓ వెంకటయ్య అన్నారు. బుధవారం స్థానిక ఏఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా బయో కంపెనీలకు చెందిన పురుగు మందులు విక్రయించకూడదన్నారు. లైసెన్స్ లేని వ్యక్తులు, దుకాణాలు, దళారులు, ఇతరత్రా వ్యాపారుల వద్ద కొనుగోలు చేయకూడదని సూచించారు. సరుకు లాట్ నంబర్, తయారీ తేదీ, రకం ఇలా అన్ని వివరాలు ఉంటేనే కొనుగోలు చేయాలన్నారు. వ్యాపారి సంతకం చేసిన బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయశాఖ అనుమతి పొందిన డీలర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, వ్యవసాయ సహకార సంఘాల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏ, వీహెచ్‌ఏలు కొండలరావు, హేమ పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థుల గుర్తింపు



కొండంపేటలో దివ్యాంగ విద్యార్థులను గుర్తిస్తున్న ఎంఈఓ దుర్గారావు, తదితరులు

రాజాం: గ్రామాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల గుర్తింపు కార్యక్రమం జరుగుతోందని ఎంఈఓ యాగాటి దుర్గారావు అన్నారు. మండలంలోని కొండంపేట, పొగిరి, నందబలగ, కంచరాం, తదితర గ్రామాల్లో బుధవారం దివ్యాంగ విద్యార్థులను గుర్తించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 18 సంవత్సరాల్లోపు గల దివ్యాంగులకు భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు.ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, బిహేవియర్ మోడిఫికేషన్ వంటి కార్యక్రమాలు చేపట్టి, వారి నడవడికలో మార్పులు తీసుకువస్తామన్నారు. ఈ నెల 9 వరకు గుర్తింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఐఈడీ ఉపాధ్యాయులు ఎస్.హరిబాబు, వి. శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

రెండుపూటలా పనులు చేయాలి

- ఇన్‌చార్జ్ ఏపీఓ నరేంద్రకుమార్



ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఏపీఓ

మెరకముడిదాం: ఉపాధి వేతనదారులు రెండుపూటలా పనులు చేయాలని ఇన్‌చార్జ్ ఏపీఓ నరేంద్రకుమార్ అన్నారు. మండలంలోని భీమవరంలో చెల్లయ్య చెరువులోచేపడుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. 194 మంది వేతనదారులు పనులకు హాజరైనట్లు గుర్తించి, వారి మస్టర్లను తనిఖీ చేశారు. ఫారం పాండ్‌లు తవ్వే సమయంలో నిర్దేశిత కొలతలు పాటించాలన్నారు. తోటల గట్లు వేసినపుడు గట్లు పొడవు, వెడల్పుల కొలతలు తీసుకోవాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న వారు మాత్రమే పనులకు హాజరుకావాలని సూచించారు. పని ప్రదేశంలో తాగునీరు, నీడ కోసం టెండ్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండేలా చూడాలని క్షేత్రసహాయకుడు సత్యనారాయణకు సూచించారు.